సాక్షి కామారెడ్డి

ఆదివారం । 14 । మే । 2023



తీరనున్న జంతువుల దాహం

ఎండలు మండుతున్న నేపథ్యంలో అడవుల్లో సంచరించే జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది.

- 8లో ▸



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసికోల్లాసం కలగడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి అన్నారు.

- 9లో ▸


వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.9 /25.4

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

అమ్మ చెక్కిన జీవితాలు!

- రెక్కల కష్టంతో పిల్లలను తీర్చిదిద్దారు
- తల్లులు చూపిన దారిలో ఎదిగిన బిడ్డలు
- నేడు మాతృ దినోత్సవం



మాతృ దినోత్సవం

సాక్షి, కామారెడ్డి: ఈ భూమిపై పుట్టిన ప్రతిఒక్కరూ మాట్లాడే తొలి పలుకు అమ్మ.. నవ్వినా, ఏడ్చినా, ఆకలేసినా.. పలికేది అమ్మ పిలుపే. అమ్మ అనే పదంలో ఎంతో తీయదనం ఉంటుంది. నవమాసాలు మోసి, కనీ, బిడ్డ తనకాళ్లపై నడిచే వరకూ కష్టనష్టాలెన్నింటినో భరించి గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు ఆమె చేసే త్యాగం ఎన్నటికీ మరవలేనిది. తను బతికి ఉన్నంత వరకూ బిడ్డలకే తన తొలి ప్రాధాన్యమిచ్చేది అమ్మ. అయితే సాఫీగా సాగుతున్న జీవితం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురై, జీవితాంతం తోడుంటానని బాసలు చేసిన భర్త అర్థాంతరంగా తనువు చాలిస్తే ఆమె పరిస్థితి ఊహించుకోవాలంటేనే భయమేస్తుంది. తోడు లేని జీవితం ఒకవైపు, పిల్లల్ని పెంచి పెద్దచేయాల్సిన బాధ్యత మరోవైపు ఆమెకు సవాల్‌గా మారుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో మంది తల్లులు తమ బాధను దిగమింగుకుని బీడీలు చుడుతూ కొందరు, కూలీనాలీ చేస్తూ మరికొందరు, కుల వృత్తులు చేస్తూ ఇంకొందరు, చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ మరికొందరు, నాగలి పట్టి వ్యవసాయం చేస్తూ కొందరు తల్లులు పిల్లల్ని తీర్చిదిద్దడంతో చెమటోడ్చారు. పిల్లలే జీవితంగా బతుకులు వెళ్లదీశారు. పిల్లల చదువు కోసం రాత్రింబవళ్లు రెక్కలుముక్కలు చేసుకున్నారు. తల్లి పడ్డ శ్రమను చూసిన పిల్లలు ఆమె చూపిన బాటలో నడిచి ప్రయోజకులయ్యారు. కట్టుకున్న భర్త దూరమైనా, రాత్రింబవళ్లు కష్టపడి కుటుంబాన్ని నిలబెట్టుకున్న పలువురు తల్లులపై 'మాతృ దినోత్సవం' సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

కన్నీళ్లను దిగమింగుకుని..



మాచారెడ్డి: ముగ్గురు కొడుకులు స్కూలుకు వెళ్లి చదువుకుంటున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించాడు. కుటుంబ భారం తల్లి మోయాల్సి వచ్చింది. మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లెకు చెందిన మ్యాడం శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా భార్య, పిల్లలతో సంతోషంగా జీవనం సాగిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ మృతిచెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇల్లు, పిల్లలే తప్ప మరే లోకం తెలియని భార్య సువర్ణ కుటుంబ భారాన్ని మోయాల్సి వచ్చింది. కారుణ్య నియామకం ద్వారా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిగా ఉద్యోగంలో చేరింది. పిల్లల్ని చదివించడానికి కష్టపడింది. పెద్ద కొడుకు నవీన్, రెండో కొడుకు నిఖిల్ ఇద్దరూ ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. చిన్నవాడు భరత్ కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సంపాదించి పూర్తి చేసి హౌజ్ సర్జన్ చేస్తున్నాడు. ఈ సందర్భంగా సువర్ణ పెద్ద కొడుకు నవీన్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. అమ్మ మమ్మల్ని అన్నీ తానై చదివించి తీర్చిదిద్దిందని, అమ్మంటే తమకు ప్రాణమని పేర్కొన్నాడు.

కష్టాలకు ఎదురొడ్డింది..



ఇద్దరు కొడుకులతో గంగమణి

మాచారెడ్డి: పిల్లలకు ఊహ తెలియకముందు తండ్రి చనిపోవడతో పిల్లల్ని పెంచి పెద్ద చేయడానికి ఆ తల్లి బీడీలు చుడుతూ, వ్యవసాయ పనులు చేస్తూ కష్టపడింది. మాచారెడ్డి మండలంలోని భవానీపేటకు చెందిన మంద మధుసూదన్‌రెడ్డి 2000 సంవత్సరంలో చనిపోయాడు. దీంతో కుటుంబ భారాన్ని ఆయన భార్య గంగమణి నెత్తినెత్తుకుని పిల్లల్ని చదివించింది. పెద్ద కొడుకు రమణారెడ్డి డిప్లొమా, టీటీసీ, గ్రాడ్యుయేషన్ చదివాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నాడు. చిన్న కొడుకు దీపక్‌రెడ్డి ఎంబీఏ చదివి ప్రైవేటు కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తమ భవిష్యత్తు కోసం అమ్మ ఎన్నో కష్టాలను అనుభవించిందని రమణారెడ్డి, దీపక్‌రెడ్డిలు తెలిపారు. ఏమిచ్చినా అమ్మ రుణం తీర్చుకోలేమని, అమ్మను సంతోషంగా ఉంచడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు.

బీడీలు చుట్టి.. ముగ్గురు పిల్లల్ని తీర్చిదిద్ది..



ఎల్లారెడ్డి రూరల్: భర్త గుండెపోటుతో తనువు చాలించగా, కుటుంబ భారాన్ని ఎత్తుకున్న ఆయన భార్య బీడీలు చుడుతూ ముగ్గురు పిల్లల్ని తీర్చిదిద్దింది. ఎల్లారెడ్డి మండలంలోని రత్నాపూర్‌లో చంద్రయ్య, వెంకటలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. 2014లో చంద్రయ్య గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో కుటుంబ భారాన్ని వెంకటలక్ష్మి మోయాల్సి వచ్చింది. కష్టపడి పిల్లల్ని చదివించింది. పెద్ద కూతురు జ్యోతి బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం సాధించగా, కొడుకు కిరణ్ కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాడు. చిన్న కూతురు స్వాతి ఎస్సైగా సెలెక్టయ్యింది. తర్వాత సహాయ గణాంక అధికారి పోస్టుకూ ఎంపికైంది. ఎస్సై వద్దనుకుని గణాంక అధికారిగా ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. అమ్మ అన్నీ తానై మమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దిందని జ్యోతి, కిరణ్, స్వాతి తెలిపారు.

టైలరింగ్ చేసి కొడుకులను చదివించి..



కామారెడ్డి అర్బన్: పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే భర్తను కోల్పోయినా తన పుట్టింటివారి సహకారంతో ఆత్మస్థైర్యంతో అద్దె ఇంట్లో ఉంటూ టైలరింగ్ చేస్తూ తన ఇద్దరు కొడుకులను ఉన్నతులుగా తీర్చిదిద్దింది ఓ మాతృమూర్తి. కామారెడ్డికి చెందిన కందు కూరి పద్మ, రవీందర్ దంపతులకు ఇద్దరు కొడుకులు సందీప్‌కుమార్, సున్నీత్‌కుమార్‌లు ఉఆన్నరు. కిరాణషాపుపై జీవనం కొనసాగించే రవీందర్ 1997లో అనారోగ్యంతో మరణించాడు. పెళ్లయిన ఐదేళ్లలోపే భర్తను కోల్పోగా పుట్టింటి వారు చేరదీసి పద్మకు ధైర్యం ఇచ్చారు. పద్మ టైలరింగ్ నేర్చుకుని అద్దె ఇంట్లో ఉంటూ స్వయం ఉపాధిగా టైలరింగ్, చీరల వ్యాపారం చేస్తూ తన ఇద్దరు కొడుకులను చదివించింది. ఇద్దరు కొడుకులు ఇంజినీరింగ్ చదివి స్థిరపడ్డారు. పెద్ద కొడుకు సందీప్‌కుమార్ వాసవీ ట్రస్ట్ సహకారంతో బిట్స్‌లో సీటు సంపాదించి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించారు. ఇతని పెళ్లికాగా భార్య సైతం అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. రెండో కొడుకు సన్నీత్‌కుమార్ వీఐటీ, చెన్నైలో చదివి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

ఐదుగురిని ప్రయోజకులను చేసిన తల్లి



నలుగురు కొడుకులతో సుజాత

మాచారెడ్డి: ఐదుగురు పిల్లలు. స్కూల్‌కు వెళ్తున్నారు. భర్త మరణం ఆమెను ఆందోళనకు గురిచేసింది. పిల్లల్ని పెద్ద చేయడానికి నానా కష్టాలు పడింది. బీడీలు చుట్టింది. తీరొక్క కష్టం జేసి ఐదుగురినీ పెంచి పెద్ద చేసింది. ఆమె కష్టానికి ఫలితం దక్కింది. అందరూ ప్రయోజకులయ్యారు. మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం)కు చెందిన దుంపేటి భాస్కర్, సుజాతలకు నలుగురు కొడుకులు, ఒక కూతురు. 2007లో భర్త భాస్కర్ అనారోగ్యానికి గురై మరణించాడు. అప్పటికే ఆయన వైద్యం కోసం ఉన్న ఆస్తులన్నీ అమ్మాల్సి వచ్చింది. పెద్ద కొడుకు మహేశ్ ఇంటర్ చదువుతున్నాడు. రెండో కొడుకు రాజేశ్ తొమ్మిదో తరగతి, కవలలైన విజయ్, వినయ్‌లు ఏడో తరగతి, కూతురు రమ్య పదో తరగతి చదువుతున్నారు. అప్పుడు మొదలయ్యాయి ఆమెకు కష్టాలు. కష్టాలు, కన్నీళ్లను దిగమింగుకుని పెద్ద కుమారుడు మహేశ్‌ను డిగ్రీ దాకా చదివించింది. తల్లి కష్టాన్ని చూసిన మహేశ్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగంలో చేరాడు. రాత్రింబవళ్లు కష్టపడుతూ తల్లికి ఆసరా అయ్యాడు. అసిస్టెంట్ మేనేజర్ హోదాలో పనిచేస్తున్నాడు. రెండో వాడు రాజేశ్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివి ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కవల పిల్లలు వినయ్, విజయ్‌లు ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కూతురు రమ్యను డిగ్రీ, బీఈడీ చదివించి పెళ్లి చేసి పంపారు. అమ్మ వల్లే తాము ఎదిగామని, అమ్మకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని ఆ పిల్లలు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చూడాలి



మద్నూర్(జుక్కల్): పక్క రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వరి ధాన్యం తరలకుండా చూడాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న చెక్‌పోస్టును శనివారం ఆయన తనిఖీ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వరి ధాన్యం మన రాష్ట్రంలోకి తరలించకుండా ఉండేందుకు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యం మన రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ అనిల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మంచిని ధైర్యంగా ఆచరించండి'

- వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో మాధవానంద సరస్వతి



కామారెడ్డి అర్బన్: హిందూ ధర్మరక్షణ కోసం మంచిని ధైర్యంగా ఆచరించాలని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి దేవీ విహార్‌లో శ్రీవీరాంజనేయస్వామి దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన నవగ్రహ మండల దేవతా హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం హనుమాన్‌జయంతి సందర్భంగా స్థిర ప్రతిష్ఠాపన నిర్వహించడం విశేషమన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ రమణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.భైరయ్య, ఎ.మనోహర్‌రావు, బి.నాగవేందర్, కె.స్వామి, వేద పండితులు నారాయణశర్మ, ఆంజనేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌గా నర్సయ్య



దోమకొండ: సదాశివనగర్‌లోని (కేన్ డెవలప్‌మెంట్ కమిటీ) సీడీసీ చైర్మన్‌గా దోమకొండకు చెందిన ఐరేని నర్సయ్యను ప్రభుత్వం నియమించింది. నియామక పత్రాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శనివారం ఆయనకు అందజేశారు. అదేవిధంగా భిక్కనూరు మండలం బస్వాపూర్‌కు మల్లారెడ్డి, లింగంపేటకు చెందిన ప్రతాప్‌రెడ్డిలను సభ్యులుగా నియమించారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఐరేని నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెబాట వీడి.. విధుల్లో చేరి..

- ఎట్టకేలకు విధుల్లో చేరిన జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు
- 16 రోజులపాటు సమ్మె
- ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వెనక్కి తగ్గిన పంచాయతీ కార్యదర్శులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెబాట పట్టిన జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఎట్టకేలకు శనివారం విధుల్లో చేరారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలుండగా వారిలో 469 మంది జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులున్నారు. మిగతా 57 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో ఉన్నారు. కాగా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు గతనెల 28న సమ్మె ప్రారంభించారు. కాగా పంచాయతీ కార్యదర్శుల సమ్మెపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోగా ఈ నెల 9న సాయంత్రం 5 గంటలలోపు విధుల్లో సమ్మె విరమించి విధుల్లో చేరాలని, విధుల్లో చేరనివారిని ఉద్యోగాల నుంచి టెర్మినేట్ చేస్తామని ప్రభుత్వం నోటీసులు జారీచేశారు. ఈ మేరకు జిల్లాలో ఈ నెల 9న సాయంత్రం వరకు జిల్లాలో 11 మంది జేపీఎస్‌లు, 09 మంది ఓపీఎస్‌లు విధుల్లో చేరారు. ప్రభుత్వం తరపున నోటీసులు అందినా ఎక్కువ మంది పంచాయతీ కార్యదర్శులు వెనక్కి తగ్గకుండా సమ్మెలోనే కొనసాగారు. కాగా శనివారం వరకు సమ్మెబాట వీడి విధుల్లో చేరాలని, విధుల్లో చేరని వారి స్థానంలో తాత్కాలిక పద్ధతిన కొత్తవారిని నియమించుకోవాలని శుక్రవారం రాత్రి ప్రభుత్వం నుంచి కలెక్టర్లకు ఉత్తర్వులు అందాయి. ఈ క్రమంలో సమ్మెలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఒక్కొక్కరుగా విధుల్లో చేరారు. దీంతో జిల్లాలో 469 మంది జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మెబాట వీడి విధుల్లో చేరారు. కాగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించే విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై జేపీఎస్, ఓపీఎస్‌లు అసంతృప్తిగా ఉన్నారు.

అమ్మ పేరుమీద సేవలెన్నో..

- రూ. 10 లక్షలతో బీబీపేటలో మోడ్రన్ టాయిలెట్స్ నిర్మాణం
- మండలానికి ఉచితంగా అంబులెన్స్ అందజేత
- నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ





బీబీపేటలో నిర్మించిన మోడ్రన్ టాయిలెట్స్

బీబీపేట: జన్మనిచ్చిన కన్నతల్లి పేరు మీద గ్రామానికి, పేదింటి ఆడ పిల్లలకు, నిరుద్యోగులకు ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ తల్లి పేరును చిరస్థాయిగా నిలుపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు బీబీపేటకు చెందిన డాక్టర్ పెరుమాండ్లు. మండల కేంద్రానికి చెందిన ఈ వ్యాపారవేత్త గ్రామంలోని వారంతపు సంతలో మహిళల ఇబ్బందులను గ్రహించి.. తన తల్లి సువర్ణమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ. 10 లక్షలతో మోడ్రన్ టాయిలెట్లు నిర్మించి గ్రామ పంచాయతీకి అందజేశారు. దాని నిర్వహణ ఖర్చులు సైతం తానే భరిస్తున్నాడు. అలాగే అంబులెన్స్‌ను ఉచితంగా అందజేశారు. ఆడపిల్లలకు ఇప్పటికే చాలా మందికి కుట్టుమిషన్లు నేర్పించి కుట్టు మిషన్లను ఉచితంగా అందజేశారు. అంతే కాకుండా నిరుద్యోగులకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జన్మనిచ్చిన తల్లి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, సేవ చేయడంలోనే ఆనందం దొరుకుతుందని పెరుమాండ్లు తెలిపారు. ఎంత సంపాదించినప్పటికీ కన్నతల్లి లేకపోవడం తీరని లోటన్నారు.

కాంగ్రెస్‌లో జోష్..

- కర్ణాటక విజయంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తల సంబురాలు
- ఇప్పటికే జిల్లాలో రేవంత్‌రెడ్డి పాదయాత్రతో ఊపు
- అంతకుముందే ఉమ్మడి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో రాహుల్ భారత్ జోడో యాత్ర



భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ జిల్లా శ్రేణుల్లో జోష్ నెలకొంది. జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. పక్కరాష్ట్రం కావడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత గెలుపు ప్రభావం తెలంగాణపై పడుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారని అంటున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో పార్టీ కేడర్ స్తబ్దుగా ఉన్న సందర్భంలో జుక్కల్ నియోజకవర్గంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర విజయవంతమైంది. తర్వాత మార్చిలో ఉమ్మడి జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన పాదయాత్ర సైతం సక్సెస్ అయ్యింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉరిమే ఉత్సాహం నెలకొంది. రైతు సమస్యలపై రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'రైతు కమిషన్' ఏర్పాటు చేస్తామని ఇక్కడి నుంచే ప్రకటించారు. దీంతో పాటు ధరణి రద్దు విషయమై పార్టీ శ్రేణులు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రేవంత్ పర్యటన అనంతరం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ విషయమై సైతం పార్టీ శ్రేణులు జిల్లాలో భారీగా ఆందోళనలు నిర్వహించారు. పెట్రో ధరల పెంపుపై ఆందోళనలు జరిగాయి. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాలతో తిరుగుతున్నారు. ఇక అకాల వర్షాలకు తడిసిన పంట నష్టంపై రైతులను కలుస్తూ, పరిహారం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



రాహుల్ గాంధీ భారత్ జోడో లక్ష్యం నెరవేరే దిశగా మొదట హిమాచల్‌ప్రదేశ్‌లో, తాజాగా కర్ణాటకలో అడుగులు మొదలయ్యాయి. రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. ముఖ్యంగా తెలంగాణలో చీకటి మిత్రులైన మోదీ, కేసీఆర్‌లకు షాక్ తగులుతుంది. కర్ణాటకలో ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రజలు పునరావృతం చేస్తారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్ ప్రభుత్వాన్ని దించేసిన కన్నడ ప్రజలు, తెలంగాణలోనూ 30 శాతం కమీషన్ తీసుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేస్తారన్నారు. ఈ విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడంతో పాటు నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేలా చేస్తుందన్నారు. అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ నుండి పారదోలేలా ప్రజలు కంకణం కట్టుకోవాలి. తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, నిజామాబాద్

భగ్గుమన్న భానుడు!

- భిక్కనూరులో 43.8 డిగ్రీలు
- జిల్లాలో పెరిగిన ఎండల తీవ్రత
- పగటిపూట బయట తిరగని జనం

సాక్షి, కామారెడ్డి: భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలతో జనం విలవిల్లాడుతున్నారు. శనివారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఎండల తీవ్రత పెరిగింది. భిక్కనూరు మండల కేంద్రంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగమంటూ రావడంతో జనం ఇబ్బందులు పడ్డారు. పగటిపూట అయితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. అయితే కూలీ పనులు, రోడ్లమీద చిన్న చిన్న వృత్తులు, వ్యాపారాలు చేసుకుని జీవించే పేదలు ఎండలతో ఇబ్బందులు పడ్డారు. ఎండల తీవ్రత మూలంగా ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లాలో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

భిక్కనూరు	43.8	రామారెడ్డి	40.5	లింగంపేట్	39.2
బీర్కూర్	42.4	మేనూర్	40.4	దోమకొండ	39.1
పుల్కల్	42.1	గాంధారి	40.2	లచ్చాపేట్	39.1
సర్వాపూర్	42.0	దోంగ్లీ	40.1	మాచాపూర్	38.9
కొల్లూర్	41.8	హసన్‌పల్లి	40.1	కామారెడ్డి కలెక్టరేట్	38.5
మక్దుంపూర్	41.7	పెద్దకొడప్‌గల్	40.1	తాడ్వాయి	38.4
పిట్లం	41.7	పాతరాజంపేట	40.0	రామలక్ష్మణ్‌పల్లి	38.4
జుక్కల్	41.4	సోమూర్	39.7	బీబీపేట	38.1
బొమ్మన్‌దేవ్‌పల్లి	41.3	నాగిరెడ్డిపేట	39.6	ఆర్గొండ	37.9
బిచ్కుంద	41.1	సదాశివనగర్	39.6		
నస్రుల్లాబాద్	40.6	ఇసాయిపేట్	39.3		

క్లుప్తంగా

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు

- ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గద్దెనెక్కిన బీజేపీకి అక్కడి ఓటర్లు చెంపపెట్టులాంటి తీర్పును వెలువరించారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ అప్రజాస్వామిక, నియంతృత్వ, మతతత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టి ఆ పార్టీకి ఘోరి కడతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మతతత్వాన్ని రెచ్చగొట్టి, ప్రజలను మాయ మాటలతో లోబర్చుకుని, భ్రమల్లో ముంచాలనే ఆ పార్టీ క్షుద్ర విద్యలను ప్రజలు తిప్పికొడతున్నారని, బీజేపీ నాయకుల నాటకాలు ఇకపై సాగబోవని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీని బొందపెట్టడం ఖాయమని, కర్ణాటకలో ఊహించిన ఫలితాలే వచ్చాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీదని ఆరోపించారు. దేశంలో బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని, అందుకు కర్ణాటక ఫలితాలే నిదర్శమని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఖలీల్‌వాడి: వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ జోస్యం చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుతో జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, సీట్లు పంపిణీ చేసి నృత్యాలు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, పీసీసీ సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, రాజ నరేంద్ర గౌడ్, ప్రీతం, రామకృష్ణ, వినయ్, సంతోష్, విజయ్‌పాల్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, సయ్యద్ అష్రాఫ్, శివ, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. శనివారం ఆయన నివాసం నుంచి వినాయక్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



తీరనున్న జంతువుల దాహం



వర్ని ఫారెస్టులో ట్యాంకర్ ద్వారా గుంతలో నీటిని పోస్తున్న దృశ్యం



మంచిప్ప అడవుల్లో సాసర్‌పిట్ వద్ద దాహం తీర్చుకుంటున్న చిరుతలు(ఫైల్)

- సాసర్‌పిట్లలో నీళ్లు నింపాలని బీట్ ఆఫీసర్లకు ఆదేశాలు
- వేసవి నేపథ్యంలో అటవీ శాఖ చర్యలు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎండలు మండుతున్న నేపథ్యంలో అడవుల్లో సంచరించే జంతువుల దాహార్తిని తీర్చడానికి అటవీ శాఖ కదిలింది. వన్యప్రాణులు నీటి కోసం బయటకు రాకుండా సాసర్‌పిట్లను నింపడానికి చర్యలు చేపట్టింది. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు వెంటనే పనులు ప్రారంభించాలని జిల్లాలోని రేంజ్, సెక్షన్, బీట్ ఆఫీసర్లకు డీఎఫ్‌వో వికాస్ మీనా ఆదేశాలిచ్చారు. జిల్లా అటవీ విస్తీర్ణం 2,12,500 ఎకరాల్లో ఉంది. అడవులను సంరక్షించడానికి నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, వర్ని, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ కలిపి మొత్తం ఏడు రేంజ్‌లను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అయితే, జిల్లా వ్యాప్తంగా అడవుల్లో 183 సాసర్‌పిట్లను (నీటి గుంతలు) నిర్మించారు. కొన్ని చోట్ల నీళ్లు లేక వన్యప్రాణులు పంట పొలాలు, జనవాసాల్లోకి, రోడ్ల పైకి వస్తున్నాయి. ఈ క్రమంలో అవి ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ఒక్కోసారి దాహంతో ప్రాణాలు విడిచిన సందర్భాలు లేకపోలేవు. ఇందుకు వర్షాలు కురిసే వరకు వారానికోసారి గుంతల్లో నీళ్లు పోయాలని సెక్షన్, బీట్ ఆఫీసర్లకు సూచించారు. వారం మధ్యలో ఒకసారి వచ్చి నీళ్లు ఉన్నాయో లేవో చూసుకుని ఎప్పుడు నిండుగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సాసర్‌పిట్లలో నీళ్లు పోయడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు అటవీ జంతువులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

బిల్లులిస్తాం.. నీళ్లు పోయండి

ప్రతి వేసవిలో ఫారెస్టు అధికారులు సాసర్‌పిట్లలో నీటిని నింపాల్సి ఉంటుంది. ట్యాంకర్లతో అడవుల్లోకి వెళ్లి గుంతల్లో నీళ్లను పోయాలి. నెలలో కనీసం ఐదుసార్లయిన ఇలా చేయాలి. కానీ, చేసిన పనులకు బిల్లులు సక్రమంగా రావడం లేదు. దీంతో తమ జేబుల్లోంచి వెచ్చించిన ఫారెస్టు అధికారుల్లో కొంత అసంతృప్తి ఉంది. అయితే గతేడాది చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోయినా, ఈసారి కూడా గుంతల్లో నీటిని పోసేందుకు అటవీ అధికారులు సిద్ధమయ్యారు. బిల్లులు ఇస్తామని, అందుకు సంబంధించిన ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాలను సమర్పించాలని రాష్ట్ర అధికారులు జిల్లా అధికారులకు సూచించారు. బిల్లులు వస్తాయమనే నమ్మకంతో, జంతువులను కాపాడాలనే బాధ్యతతో సాసర్ పిట్లలో ప్రస్తుతం నీటిని నింపుతున్నారు.

ఆదేశాలిచ్చాం



రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో నీటిని నింపాలని సిబ్బందిని ఆదేశించాం. దాహార్తితో ఏ ఒక్క జంతువు మరణించడానికి వీల్లేదు. వాటిని సంరక్షించడానికి అన్ని రకాల చర్యలు చేపడుతాం. వర్షాలు కురిసే దాకా నిరంతరంగా గుంతల్లో నీటిని నింపుతాం. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించం.

– వికాస్‌మీనా, జిల్లా అటవీ అధికారి, నిజామాబాద్

ప్రయాణికుల భద్రతకు చర్యలు

- 'మై ఆటో ఈజ్ సేఫ్' అమలుకు సన్నాహాలు
- ఆటో డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: ఆటోల్లో వెళ్లే ప్రయాణికుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీని కోసం మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. 2019లో రాష్ట్ర పోలీస్ శాఖ మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. అక్కడ విజయవంతం కావడంతో జిల్లాలో అమలు చేయడానికి పోలీసులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఆటో స్టాండ్‌ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 25,809 ఆటోలు, 650 వరకు క్యాబ్‌లు ఉన్నాయి.

నమోదు ఇలా..

ఆటో డ్రైవర్లు, ఓనర్లు మై ఆటో ఈజ్ సేఫ్ అప్లికేషన్‌లో గాని, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గాని వివరాలను నమోదు చేసుకోవాలి. ఆటోకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవర్ లైసెన్స్, ఆధార్ కార్డ్, మరో అడ్రస్ ప్రూఫ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలి. నమోదు చేసిన తర్వాత వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఆటోకు స్టీల్ నంబర్ ప్లేట్ తోపాటు రెండు క్యూఆర్ కోడ్‌కు చెందిన స్టిక్కర్లు ఇస్తారు. ఇందులో వివరాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన పెద్ద స్టిక్కర్‌ను ఆటో డ్రైవర్ సీటు వెనుక అతికిస్తారు. రెండో స్టిక్కర్ ఆటో ముందు లేదా వెనుక భాగంలో అతికిస్తారు. ప్రయాణికులు సదరు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో వివరాలు వస్తాయి. అంతేకాకుండా ఏదైనా ఘటన జరిగితే పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోలను పట్టుకోడానికి ఈ నంబర్ ప్లేట్, స్టిక్కర్లు సాయపడతాయి.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆటో డ్రైవర్లకు సూచనలు

ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచిస్తున్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని చెబుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, డ్రైవర్ల పక్కన ఎవరిని కూర్చోపెట్టుకోవద్దని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లు నమోదు చేసుకోవాలి

ఆటో డ్రైవర్లు, ఓనర్లు మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమంలో నమోదు చేసుకోవాలి. మై ఆటో ఇస్ సేఫ్ స్టిక్కర్లు ఉన్న ఆటోల్లోనే ప్రయాణికులు ఎక్కాలి. దీనిని ఆటో డ్రైవర్లు, ఓనర్లు తప్పని సరిగా చేసుకోవాల్సి ఉంటుంది.

– కిరణ్‌కుమార్, ఏసీపీ, నిజామాబాద్

అందరూ ఉండి అనాథలుగా..



ఆలంబన వృద్ధాశ్రమం

- జీవిత చరమాంకంలో వృద్ధాశ్రమంలో..
- పండుటాకుల కష్టాలు

నిజామాబాద్ సిటీ: అందరూ ఉన్నా వీరు అనాథలుగా మారారు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని కొందరు.. కని పెంచిన పిల్లలు దూరం పెట్టిన వారు మరికొందరు వృద్ధాశ్రమంలో ఒంటరిగా బతుకుతున్నారు. తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో సంతోషంగా చూసుకోవల్సిన బిడ్డలే దూరంగా పెడుతూ పేగు బంధాలను తెంపుకుంటున్నారు. దీంతో అందరు ఉన్న ఈ తల్లులు ఒంటరిగా ఆశ్రమంలో బతుకుతున్నారు. ముబారక్‌నగర్‌లోని ఆలంబన వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న తల్లులను మదర్స్ డే సందర్భంగా సాక్షి పలకరించింది. తాము వృద్ధాశ్రమానికి ఎందుకు వచ్చామో, ఏ పరిస్థితులలో వచ్చామో తెలుపుతూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.

చూసేవారు లేక..



ఎనిమిది సంవత్సరాల క్రితం నాకు పక్షవాతం వచ్చింది. మాకు పిల్లలు పుట్టలేరు. 12 ఏళ్ల క్రితం భర్త చనిపోగా బంధువులు కొన్ని సంవత్సరాల వరకు బాగానే చూసుకునేవారు. కొన్నేండ్లు అయ్యాక నా వల్ల సమస్యలు వస్తున్నాయని గొడవలు మొదలయ్యాయి. నా మూలంగా గొడవలు జరుగ కూడదని, ఎవరికి భారం కాకూడదని వృద్ధాశ్రమానికి వచ్చాను. బంధువులు వీలున్నప్పుడు వచ్చి చూసి వెళ్తారు.

– గంగోజీ కమలాబాయి

భర్త పోయాక ఒంటరయ్యా



నా భర్త రాజ్‌గోపాల్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసేవాడు. రెండేళ్ల ల క్రితం చనిపోయాడు. కూతురు గుండెనొప్పితో చనిపోయింది. మనవరాలి పెండ్లి చేశాక అత్తింటికి వెళ్లిపోయింది. ఒక తమ్ముడు ఉన్నాడు. నా బాగోగులు చూసేవారు లేక పోవటంతో కొద్ది నెలల క్రితం వృద్ధాశ్రమానికి వచ్చాను. మొన్నటివరకు బంధువుల మధ్య గడిపి ఇప్పుడు ఒంటరిగా బతకడం కష్టంగా ఉంది. ఇలాంటి జీవితం మరెవ్వరికి రాకూడదు.

– సీహెచ్ ప్రమీల, శివాజీనగర్

దేవుడి పిలుపు కోసం..



నాకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. అందరికి పెండ్లిలు చేశాను. కొడుకు హైదరాబాద్‌లో ప్రైవేట్‌లో పని చేస్తాడు. నన్ను చూసుకోవటం అతనికి కుదరటం లేదు. కూతుళ్ల జీవితాలు వారివి. కొడుకు రెండు నెలలకు ఒకసారి వచ్చి చూసివెళ్తాడు. మనుమండ్లు, మనుమరాళ్లు గుర్తుకు వస్తారు. ఏమిటి ఈ జీవితమంటూ ఏడుపు వస్తుంది. దేవుడి పిలుపు కోసం నిత్యం ఎదురు చూస్తుంటాను.

– నర్సవ్వ, వెల్మల్

అ'పూర్వ' సమ్మేళనం



గోపాల్‌పేట హైస్కూల్‌లో నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో శనివారం 1980–81లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్దులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, శ్యాంరావును పూర్వ విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు గఫార్, శ్రీనివాస్‌రెడ్డి, పండరి, వీరేశం, నారాగౌడ్ పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు'



మాట్లాడుతున్న వేణుగోపాల్ యాదవ్

ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవ జాతికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని పీసీసీ సంయుక్త కార్యదర్శి బాస వేణుగోపాల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, కురుమ సంఘం నాయకుడు మహేష్ అన్నారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇష్టారీతిన మాట్లాడితే ఎవరు సహించరన్నారు. ఈ సమస్యకు ప్రధాన కారణం మంత్రి తలసాని శ్రీనివాస్ అన్నారు. మంత్రి ఇచ్చిన దానికి ప్రతి సమాధానం రేవంత్‌రెడ్డి ఇచ్చారని పేర్కొన్నారు. దీనిని కులానికి అంటగట్టడం సరికాదన్నారు. నేతల మధ్య జరిగిన సమస్యను కులానికి ముడి పెట్టి రాజకీయ రంగు పూస్తున్న ఘనత శ్రీనివాస్‌యాదవ్‌కు దక్కుతుందన్నారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలోని యాదవ, కురుమ సంఘం నాయకులు బాసటగా అండగా ఉంటున్నారని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, రాజ నరేంద్ర గౌడ్, ప్రీతం, శోభన్, వినోద్, రాజు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న సాయాగౌడ్

మోపాల్: ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయాగౌడ్ డిమాండ్‌చేశారు. శనివారం మండలంలోని కంజర్, కులాస్పూర్, బాడ్సి, తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సాయాగౌడ్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కనీసం టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయడం లేదన్నారు. తాగునీటి వసతి, పరికరాలు లేవన్నారు. కూలీకి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, ఏడాదిలో 250 రోజులు పని కల్పించాలని డిమాండ్‌చేశారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, లేకుంటే ఉపాధి కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని, విజయవంతం చేయాలని కోరారు. దండు గంగమల్లు, గంగారెడ్డి, చిరంజీవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

నిజాంసాగర్: నిజాంసాగర్ మండల కేంద్రంలో వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన అంబయ్య (68) రెండ్రోజుల క్రితం కామారెడ్డి జిల్లా తాడ్వాయి లోని శబరిమాత ఆలయ దర్శనానికి వచ్చాడు. శనివారం తిరిగి వెళ్తూ నిజాంసాగర్ బస్టాండు ప్రాంతంలో ఎండవేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వృద్ధునికి సపర్యలు చేసి ఓఆర్ఎస్ తాగించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వృద్ధుడు చేపోయాడు. మృతుని కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు.



వడదెబ్బతో స్పృహ తప్పిన వృద్ధుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

అమ్మకు నీరాజనం..





దివ్యాంగుడైన కొడుకు సైకిల్‌ను నెట్టుతున్న మాతృమూర్తి



అమ్మ ప్రేమ వెలకట్టలేనిది.. తన బిడ్డ కోసం తల్లి ఎంత కష్టమైన భరించి పెంచి పెద్ద చేస్తుంది. ఏడిస్తే పాలిస్తుంది.. లాలిస్తుంది. నిజామాబాద్ నగరంలో శనివారం తీసిన మాతృమూర్తుల చిత్రాలు..

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోర్తాడ్: మోర్తాడ్ మండలం గాడ్లపేట్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేల్పూర్ మండలం పడిగెల్‌కు చెందిన అబ్బల అర్జున్(40) మరణించాడు. పడిగెల్ నుంచి మోర్తాడ్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్మూర్ వైపు వెళ్తున్న హైచర్ ఢీకొనడంతో ఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడి తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యంరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మద్నూర్: మండలంలోని మేనూర్ గ్రామానికి చెందిన మాధవరావు(24) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. ఈ నెల 9న రాత్రి మేనూర్ గ్రామానికి చెందిన రాజు, శ్రీకాంత్, మాధవరావు బైక్‌పై డోంగ్లీ మండలంలోని మొగా గ్రామం వైపు వెళ్తుండగా రోడ్డుపై నిలిపి ఉన్న వడ్ల లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాజు, శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలు కాగా మాధవరావుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతు శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ యాజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి..

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్‌కు చెందిన చుక్కా కృష్ణాగౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాగౌడ్ అనారోగ్యంతో బాధపడటంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 6న ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణాగౌడ్‌ను కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించారన్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చుక్క భవాని ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి పది తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్వ లీలావతి ఇంట్లో ఒక్కరే ఉండటంతో రాత్రి భోజనం చేసి ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి నిద్రపోయింది. శనివారం ఉదయం ఇంటికి వెళ్లే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 10 తులాల బంగారం పోయినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

తాడ్వాయి: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కుర్ర సాయిలు(55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రెండేళ్ల క్రితం సాయిలు కాలుకు దెబ్బతగిలింది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి(41) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విజయలక్ష్మి ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదన్నారు. బంధువులు, చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.